క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఖాజీపురా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. వట్టెపల్లి, గుంతల్‌షా దర్గా, ఫలక్‌నుమా యూజీసీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు.. హసన్‌నగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన షేక్‌పేట్ డివిజన్ కమిటీ సభ్యులు

గోల్కొండ: ప్రైవేటు పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు మరింత క్రమశిక్షణతో ముందుకు సాగుతామని ఆల్ ఇండియా ఐడీఎల్ టీచర్స్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు మహ్మద్ అలీ సోహేల్ అన్నారు. బుధవారం టోలిచౌకి వీనస్ హైస్కూల్‌లో గోల్కొండ, షేక్‌పేట్, ఆసిఫ్‌నగర్ మండలాలకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. షేక్‌పేట్ డివిజన్ ఐటా అధ్యక్షుడిగా మహ్మద్ ఇజాహెత్ అలీఖాన్, కార్యదర్శిగా నవీద్ బాషా, కోశాధికారిగా సయ్యద్ జమాల్ ఖాద్రీ, మహిళా కన్వీనర్లుగా వసీం ఉన్నీసా, నజుమా సుల్తానా.. ఆసిఫ్‌నగర్ మండల అధ్యక్షుడిగా హబీద్‌షేక్, కార్యదర్శిగా ఇర్ఫాన్‌బేగ్, కోశాధికారిగా ఎండీ.సోహేల్.. గోల్కొండ మండల అధ్యక్షుడిగా షేక్ అజ్మత్, కార్యదర్శిగా ఎండీ మహమూద్ హుస్సేన్ తదితరులు ఎన్నికయ్యారు.

శివరాంపల్లిలో ఘనంగా బోనాలు



మల్లన్నకు పూజలు చేస్తున్న సదాల శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని మల్లన్న స్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామునే మల్లన్న స్వామికి అభిషేకంతో పూజలను ప్రారంభించారు. ప్రతి సంవత్సరం ఉగాది రోజున మల్లన్న స్వామికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. శివరాంపల్లి ప్రాంతానికి చెందిన ప్రజలు బోనాన్ని కుటుంబ సమేతంగా తీసుకువచ్చి మల్లన్న స్వామికి సమర్పించారు. మధ్యాహ్నం జరిగిన పూజలో రాజేంద్రనగర్ నియోజకవర్గ వైఎస్‌ఆర్‌టీపీ యువజన విభాగం కన్వీనర్ సదాల శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని మల్లన్నకు బోనం సమర్పించారు. బోనాల నేపథ్యంలో ఆలయాన్ని వివిధ రకాల పూలు, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. ప్రధాన రహదారిపై ఈ ఆలయం ఉండటంతో రాజేంద్రనగర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోచమ్మ ఆలయ ముఖద్వారానికి శంకుస్థాపన

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి బాబుల్‌రెడ్డినగర్‌లోని పోచమ్మ దేవాలయ ముఖద్వారం ఏర్పాటు పనులకు బుధవారం భూమి పూజ చేశారు. వేదపండితులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు మాజీ కౌన్సిలర్ వెంకటేష్ కురుమ, సోమ శ్రీనివాస్, లక్ష్మయ్యగుప్తా, కిష్టప్ప, లక్ష్మణ్, కుమార్, శ్రీనివాస్, శంకర్, మహేష్, శ్రీను, గోపాల్‌నాయక్, రామకృష్ణ పాల్గొన్నారు.

26న న్యూఢిల్లీలో ఉగాది వేడుకలు

లిబర్టీ: ఆదిలీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో ఈనెల 26న ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి ఒంటి గంట వరకు న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో జరుగుతాయని ఆయన తెలిపారు. ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. దేశ ప్రజలకు ప్రధానంగా తెలుగు ప్రజలకు ఉగాది నుంచి నూతన సంవత్సరం ప్రారంభమవుతుందన్నారు. ఉగాది వేడుకల్లో నూతన సంవత్సరాది గొప్పతనాన్ని వివరిస్తామన్నారు.

వైభవంగా ఉగాది వేడుకలు



సీఆర్‌పీఎఫ్ కేంద్రంలో ఉగాది వేడుకల్లో కోలాటం ఆడుతున్న మహిళలు



రేవంత్‌రెడ్డికి ఉగాది శుభాకాంక్షలు తెలిపిన నిర్మల్‌కుమార్‌యాదవ్



బజార్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయం వద్ద ఉగాది పచ్చడి వితరణ దృశ్యం



జియాగూడ బీఆర్‌ఎస్ కార్యాలయంలో..

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో శోభకృత్ నామ సంవత్సర సంబరాలను పోలీసు అధికారులు బుధవారం ఘనంగా చేసుకున్నారు. గ్రూప్ సెంటర్‌లోని స్టేషన్ మందిరంలో ఉదయం 8 గంటలకు అన్నమాచార్య కీర్తనలు, 9.30 గంటలకు పంచాంగ శ్రవణం, 10.30 గంటలకు వెంకటేశ్వర స్వామి కల్యాణం, 11 గంటలకు హారతి, ప్రసాద వితరణ, మహాప్రసాదం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం వెంకటేశ్వర స్వామి ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ఇన్‌స్పెక్టర్లు ఎం.గుర్మీత్‌సింగ్, బి.వి.రమణ, జి.డి.మూర్తి, వేణు, ఎస్‌ఐలు ఎం.రవీందర్ రెడ్డి, ఏఎండీ నాయుడు, బీవీఆర్ మూర్తి, ఏఎస్‌ఐ జీడీ వెంకటరమణ పాల్గొన్నారు.

కోమటివాడి రామాలయంలో..

దబీర్‌పురా: కోమటివాడి రామాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పంచాంగ పఠనం చేశారు. ఆలయ స్థానాచార్యుడు బొంగులూరి రాంమూర్తి శర్మ ఆధ్వర్యంలో పంచాంగ పఠనం నిర్వహించారు. కార్యక్రమంలో మదన్ మోహన్ శర్మ, శివకుమార్ శర్మ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎ.రవికుమార్, జి.శ్రీనివాస్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో..

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని పద్మావతి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం శోభకృత్ నామ సంవత్సరం సందర్భంగా సంఖ్యాశాస్త్ర నిపుణుడు దైవజ్ఞశర్మ పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఆయన ఉగాది పండుగ విశిష్టతను తెలియజేస్తూ భక్తులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు నల్లదీగల శ్రీనివాసాచార్యులు పంచాంగ పఠనం చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కె.యుగేందర్ రెడ్డి, ఆలయ ఈవో కె.జయంతి పాల్గొన్నారు.

బజార్‌ఘాట్‌లో..

నాంపల్లి: విశ్వ హిందూ పరిషత్, బాలాజీ ఫ్రెండ్స్ సంస్థల సంయుక్త నిర్వహణలో బుధవారం ఉగాది పచ్చడి వితరణ చేశారు. బజార్‌ఘాట్‌లోని హనుమాన్ దేవాలయం వద్ద శోభకృత్ నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సభ్యులు గిరిధర్, రాజశేఖర్, అజయ్‌కాంత్, విశాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోల్కొండ కోటపై..

గోల్కొండ: గోల్కొండ కోటపై కొలువుదీరిన మహంకాళి అమ్మవారి ఆలయం వద్ద బుధవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి బి.సురేష్‌చారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగించారు. సాయిబాబా చారి, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జియాగూడలో..

జియాగూడ: నూతన సంవత్సరంలో జియాగూడలో బీఆర్‌ఎస్ పార్టీ మరింత పటిష్టతతో ముందుకు సాగుతుందని మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ అన్నారు. బుధవారం ఉగాది పండుగను పురస్కరించుకుని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జియాగూడ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నరహరిచారి, సీనియర్ నాయకులు నర్మద, పి.శంకర్‌రావు, వి.దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గౌలిగూడలో..

అఫ్జల్‌గంజ్: శోభకృత్ నామ సంవత్సరంలో ప్రజలందరికీ శుభం కలగాలని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ ఆకాంక్షించారు. బుధవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గౌలిగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జాతీయ కో ఆర్డినేటర్ ధర్మేంద్ర తివారీ మహరాజ్, గోషామహల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ ఎం.పూజ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న దైవజ్ఞశర్మ



గోల్కొండ కోటపై మహంకాళి ఆలయంలో..



లాల్‌దర్వాజా సింహవాహిని ఆలయంలో..

నిర్దేశించిన స్థలాల్లోనే వ్యాపారాలు చేసుకోవాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు

చార్మినార్: రంజాన్ మాసం సందర్భంగా చిరు వ్యాపారులు నిర్దేశించిన స్థలాల్లోనే తమ వ్యాపారాలను కొనసాగించాలని దక్షిణ మండల ట్రాఫిక్ ఏసీపీ ఎ.శ్రీనివాస్‌రావు వ్యాపారులకు సూచించారు. రంజాన్ మార్కెట్‌ను పురస్కరించుకొని బుధవారం చార్మినార్‌లోని సనా ఫంక్షన్‌హాల్‌లో చార్మినార్ పరిసరాల్లోని వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులను ఉద్దేశించి ఏసీపీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ఇప్పటికే తాము నయాపూల్ నుంచి గుల్జార్‌హౌస్ వరకు రోడ్డుకు ఇరువైపులా హద్దులు నిర్దేశించినట్లు తెలిపారు. ఈ హద్దులను దాటి ముందుకెళ్తే జరిమానా విధిస్తామన్నారు. ఒక వరుసలో మాత్రమే వ్యాపారాలు నిర్వహించుకోవాలని చెప్పారు. చార్మినార్ కట్టడం నలువైపులా ఉన్న చిరు వ్యాపారులు నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. సామూహిక ప్రార్థనలతో పాటు తరావీ ప్రార్థనలకు మక్కా మసీదుకు వెళ్లే వారికి అవాంతరాలు కలిగించకుండా వ్యాపారాలను కొనసాగించాలన్నారు. మక్కా మసీదులో జరిగే తరావీ ప్రార్థనలకు వచ్చే వారి సౌకర్యార్థం పార్కింగ్ స్థలాలను అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో చార్మినార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌కు దివ్యాంగుడి వినతి



వినతిపత్రం అందజేస్తున్న అబ్దుల్ ముజీబ్ ఖాన్

లాలాపేట: అబిడ్స్‌లోని హెడ్ పోస్టాఫీస్ సమీపంలో ఫుట్‌పాత్‌పై జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేస్తున్న ఐరన్ రైలింగ్ తన దుకాణానికి అడ్డుగా ఉందంటూ ఓ దివ్యాంగ వీధి వ్యాపారి అబ్దుల్ ముజీబ్ ఖాన్ బుధవారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించాడు. అక్కడ ఏర్పాటు చేసిన ఐరన్ రైలింగ్‌తో తన దుకాణానికి వెళ్లేందుకు చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందని, అక్కడ చిన్న గేటు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం అందించాడు. స్పందించిన డిప్యూటీ మేయర్ జోనల్ కమిషనర్‌తో మాట్లాడి అబ్దుల్ ముజీబ్ ఖాన్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు.

పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



సమావేశంలో పాల్గొన్న మైత్రి కమిటీ సభ్యులు

గోల్కొండ: పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగాది పండుగ ప్రతి ఒక్కరికి ఆనందాలు తెచ్చే పండుగ అన్నారు. రేపటి నుంచి ప్రారంభం కానున్న రంజాన్ మాసం ఉపవాస దీక్షలు ముస్లింలకు ఎంతో పవిత్రమైనవన్నారు. పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు హిందూ, ముస్లింల మధ్య ఉన్న స్నేహ సంబంధాలను మరింత పటిష్టం చేసేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్‌ఐ శ్రీనివాస్ దాసు, మైత్రి కమిటీ అధ్యక్ష కార్యదర్శి ఎస్.రాజు వస్తాద్, ఆబేద్, అక్బర్, శ్రీకాంత్ చారి, ఖైరుద్దీన్, జంగయ్య, ఎంఏ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించండి

నాంపల్లి: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నపత్రాల లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని టీపీసీసీ కార్యదర్శి డాక్టర్ మహ్మద్ ఎజాజ్ ఉజ్ జమా డిమాండ్ చేశారు. బుధవారం నాంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. నిష్పక్షపాతంగా పోటీ పరీక్షలు నిర్వహించాల్సిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుంచి ప్రశ్నపత్రాలు అంగట్లో సరుకుల్లా బయటకు రావడం బాధాకరమన్నారు. ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని సిట్‌తో కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశించాలని కోరారు. కమిషన్‌లో పనిచేసే కొందరు ఉద్యోగుల నిర్వాకంతోనే లక్షలాది మంది నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. ఏళ్ల తరబడి కష్టపడి చదివిన చదువుకు అర్థం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ పథకాలతో బీఆర్‌ఎస్‌కు ప్రజాదరణ



శ్రావణ్‌ను సన్మానిస్తున్న సంతోష్‌గుప్తా, మమతాగుప్తా

అబిడ్స్: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని నగర బీఆర్‌ఎస్ కోఆర్డినేటర్ దాసోజు శ్రావణ్ పేర్కొన్నారు. నగర పార్టీ కో ఆర్డినేటర్‌గా నూతనంగా నియమితులైన శ్రావణ్‌ను గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు సంతోష్‌గుప్తా, మమతాగుప్తా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నివర్గాల ప్రజలు బీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని, దీంతో ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నట్లు తెలిపారు.

స్నేహితుడిపై కత్తితో దాడి

దూద్‌బౌలి: చేతి గడియారం విషయంలో ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన గొడవ కత్తిపోట్లకు దారితీసిన ఘటన బుధవారం చార్మినార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బిహార్‌కు చెందిన దిల్షాన్, వహీద్ స్నేహితులు. వీరిద్దరూ సిటీ కళాశాల చౌరస్తాలోని హెచ్‌పీ పెట్రోల్ పంపులో పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి వీరిద్దరి మధ్య గడియారం విషయంలో గొడవకు జరిగింది. కోపోద్రిక్తుడైన దిల్షాన్ వహీద్‌పై కత్తితో దాడి చేశాడు. గమనించిన స్థానికులు చార్మినార్ పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడకు చేరుకున్న పోలీసులు వహీద్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం దక్కాలి

లిబర్టీ: స్వేచ్ఛ, సమానత్వం ప్రజలందరికీ దక్కాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. అసమానతలు దోపిడీ లేని నవ సమాజాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో హింస, అణచివేత, వివక్షత, దోపిడీ, అంటరానితనం వంటి అంశాలు పెరిగిపోయాయన్నారు. బీజేపీ రహిత దేశం కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. దేశ ప్రజలందరికీ స్వేచ్ఛ, ఆర్థిక సమానత్వం, రాజ్యాధికారంలో వాటా వంటి అంశాల కోసం మిషన్ 2024 లక్ష్యంగా తాము పని చేస్తామని శ్రీకృష్ణ స్పష్టం చేశారు.

రంజాన్ ఉపవాస దీక్షల ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న మక్కా మసీదు సూపరింటెండెంట్, డీసీపీ సాయిచైతన్య

చార్మినార్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మక్కా మసీదులో జరిగే సామూహిక ప్రార్థనలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని దక్షిణ మండల డీసీపీ సాయిచైతన్య సంబంధిత అధికారులను ఆదేశించారు. మక్కా మసీదు సూపరింటెండెంట్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్ సిద్దిఖీతో సమావేశమై రంజాన్ ఉపవాస దీక్షల ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు మక్కా మసీదులో ఇప్పటికే ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును ఆయన పరిశీలించారు. మసీదు నలువైపులా ఏర్పాటు చేసిన బందోబస్తును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల రోజుల పాటు నిర్వహించే రంజాన్ మాసం ఉపవాస దీక్షలు, తరావీ, ఇఫ్తార్ విందుల సందర్భంగా మక్కా మసీదులో ప్రతిరోజూ సందడి ఎక్కువగా ఉంటున్నందున భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నెల రోజుల పాటు మక్కా మసీదులోనే ఉండే వారి ఆధార్ కార్డులను సేకరించాలని డీసీపీ మక్కా మసీదు సూపరింటెండెంట్‌కు సూచించారు. రంజాన్ మార్కెట్ సందర్భంగా మక్కా మసీదులోకి వచ్చే ముస్లింలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. డీసీపీ వెంట హుస్సేనీఆలం ఇన్‌స్పెక్టర్ నరేశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న బండి సంజయ్ తదితరులు

గోల్కొండ: భరతమాత ముద్దుబిడ్డల పేరుపై కేలండర్లు ముద్రించడం గొప్ప విషయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. కార్వాన్‌కు చెందిన వీర్ సావర్కర్ అసోసియేషన్ వారు ముద్రించిన తెలుగు కేలండర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఇలాంటి కేలండర్లు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో వీర్ సావర్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు జొన్నకుంటి మధుసూదన్ పాల్గొన్నారు.

ముస్లిం మత పెద్దలతో ఇన్‌స్పెక్టర్ సమావేశం



గౌలిపురా: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లింలందరూ భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు నిర్వహించుకోవాలని మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ ఎ.శివకుమార్ సూచించారు. మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో బుధవారం స్టేషన్ పరిధిలోని ముస్లిం మత పెద్దలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం సందర్భంగా ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కేసీఆర్ ప్రభుత్వంలో అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు



అబిడ్స్: కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతున్నాయని రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు నందకిశోర్‌వ్యాస్ బిలాల్ అన్నారు. దారుసలాంలో బీఆర్‌ఎస్ నాయకురాలు దుర్గ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, పురన్‌పోలి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరమేశ్వరి సింగ్, పి.అనిత, పుష్ప, అనూరాధ, దీపిక తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సురక్షితంగా ఉంటేనే మానవ మనుగడ సాధ్యం



వేడుకల్లో మాట్లాడుతున్న దేవేందర్

అబిడ్స్: ప్రకృతి సురక్షితంగా ఉంటేనే మనిషి మనుగడ సాధ్యమని ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ రక్తనిధి తెలంగాణ బాధ్యుడు దేవేందర్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సీతారామ్‌నగర్ ఆధ్వర్యంలో దత్తనగర్ నవగ్రహ ఆలయంలో బుధవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవేందర్ మాట్లాడుతూ.. ప్రాశ్చాత్య సంస్కృతిలో దేశం కొట్టుమిట్టాడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జీవరాశులకు జన్మభూమి, కన్నతల్లి ఎంతో పవిత్రమైనవని చెప్పారు. ప్రకృతి కాలగమనానికి హిందువుల పండుగలకు ఎంతో సంబంధం ఉందన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

గోల్కొండ: పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం టోలిచౌకిలోని తన కార్యాలయంలో పలువురు అబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్‌ఎఫ్ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుందన్నారు.

సెయింట్ ఆన్స్ కళాశాలలో స్నాతకోత్సవం



పట్టాలు అందుకున్న చిన్నారులు

విజయనగర్‌కాలనీ: చదువుతో సమస్య పరిష్కార సామర్థ్యం పెరగడంతో పాటు మనిషి మేధస్సు వికసిస్తుందని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ అమృత, డాక్టర్ జి.స్వర్ణశ్రీ, రెవరెండ్ ఫాదర్ అరోకియా స్వామి సెబాస్టియన్ అన్నారు. మంగళవారం విజయనగర్‌కాలనీ సెయింట్ ఆన్స్ పాఠశాలలో నిర్వహించిన స్నాతకోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లింగ వివక్ష చూపకుండా అందరినీ సమానంగా చదివించి వారి ఎదుగుదలకు తల్లిదండ్రులు తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఎంకేబీటీ పాఠశాల వార్షికోత్సవం



ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న స్కూల్ డైరెక్టర్ మీర్జా రిజ్వాన్ బేగ్

జియాగూడ: జియాగూడలో 40 సంవత్సరాలుగా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఎంకేబీటీ పాఠశాల కృషి అభినందనీయమని కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. జియాగూడలోని డబుల్‌బెడ్‌రూమ్ ఆట స్థలంలో నిర్వహించిన ఎంకేబీటీ స్కూల్ వార్షికోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ రిజ్వాన్‌బేగ్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ మీర్జా అక్రమ్‌బేగ్, సలహాదారుడు మీర్జా అస్లామ్‌బేగ్, ట్రస్మా ఆసిఫ్‌నగర్ మండల అధ్యక్షుడు బి.గాలయ్య, జియాగూడ టీడీపీ అధ్యక్షుడు కె.నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా సంతోషంగా ఉండాలి

లిబర్టీ: కోటి ఆశలతో నూతన సంవత్సరంలో అడుగుపెట్టిన తెలుగు ప్రజలు మరిన్ని విజయాలు సాధించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ తెలిపారు. ఉగాది నుంచి తెలుగు ప్రజలకు నూతన సంవత్సరం ప్రారంభమవుతుందని చెప్పారు. ఇండియన్ ప్రజా కాంగ్రెస్ కార్యాలయంలో అరుణరెడ్డి సారథ్యంలో బుధవారం జరిగిన ఉగాది వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కొత్త సంవత్సరంలో ప్రజలంతా ఆయురారోగ్యాలతో సిరి సంపదతో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. వేడుకల్లో పార్టీ ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు, కార్యాలయ కార్యదర్శి నంది కొండలరావు పాల్గొన్నారు.